ఉదయం దీపావళి కథల పోటీలో రు200/- కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# అదే నువ్వు - మరో నేను

గంగుల నరసింహారెడ్డి

మోహన, నేనూ ప్రేమించుకున్నాం.

"పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటాను మురళీ, నీవే నా సర్వస్వం. మన పెళ్ళి జరుగకపోతే నీకు అర్పించిన ఈ మనసుతో మరొకరికి భార్యగా నేను ఆత్మవంచన చేసుకుంటూ జీవించలేను"

"మనం పుట్టకముందే ఆ భగవంతుడు మనల్ని జంట కలిపాడు మోహనా, అందుకే మనమే కాదు మన పేర్లుకూడా అంత చక్కగా జంట కుదిరాయి. ఈ భూప్రపంచంలో మనల్నిక ఎవరూ విడదీయలేరు"

మేమిద్దరం ఇలా విశాఖ బీచ్‌లో మాట్లాడుకుంటున్నప్పుడు— గాలి నీరు ఆకాశంలాంటి పంచభూతాలు అన్నీ చెవులు రిక్కించి వింటూనే వున్నాయి.

మోహనకు నాకూ పెళ్ళి కాలేదు కానీ పెళ్ళిళ్ళయి పోయాయి. డిగ్రీ పరీక్షలు రాసి నేను మా ఊరెళ్ళేసరికి మా మేనమామ కూతురితో నా పెళ్ళికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. నేను పారిపోయి వైజాగ్ వచ్చేసరికి మోహన లేదు. కూతురి ప్రేమ వ్యవహారం తెలిసిన ఆమె తండ్రి ఢిల్లీలో వున్న ఆమె మేనమామ దగ్గరికి పంపించాడట. ఈలోగా నన్ను పెళ్ళిపీటల మీద కూర్చోబెట్టారు. మూలుగుతూ మూడు ముళ్ళు వేసి ఏడుస్తు ఏడడుగులు నడిచాను.

మరో నెలరోజుల తరువాత మోహనకు కూడా విజయవాడలో మంచి ఉద్యోగస్తునితో పెళ్ళయిపోయిందని తెలిసింది. ఆమె తండ్రి బదిలీ చేయించుకుని వెళ్ళిపోవడంతో వైజాగ్‌కు వెళ్ళినా మోహన కలిసే అవకాశం లేకుండా పోయింది.

నా భార్య మొహం వంక కూడా చూడలేని పరిస్థితిలో ఉన్నాను నేను. కళ్ళు తెరిస్తే మోహన, కళ్ళు మూసినా మోహనే! నా కళ్ళనిండా గుండెనిండా అంతటా మోహన!! అనుక్షణం నన్ను మోహన గురించిన జ్ఞాపకాలు వెంటాడుతూ పిచ్చివాడిని చేస్తున్నాయి.

నేనూ, కావేరి పేరుకు మాత్రమే భార్యాభర్తలం. లోకభీతికి ఒకే పడకగదిలోకి ఇద్దరం ప్రవేశిస్తాం కాని నేను మంచంపై పడుకుంటే తను నేలపై పడుకుంటుంది. ముద్దుముచ్చట సంగతి అటుంచి తనతో మాట్లాడాలంటేనే అయిష్టం నాకు. ఒక్కోమారు ఆమెపై కోపం కూడా వస్తుంది, ఈమె వల్లే కదా నా మోహన నాకు దూరమయింది— అని ఆలోచిస్తుంటాను.

"బావా" ఎప్పుడయినా పిలుస్తుంది కావేరి.

నేను పలకను. నా మోహన ఎలా ఉందో? ఎలా జీవిస్తోందో

"ఇట్లాంటి వాడివి నన్నెందుకు పెళ్ళి చేసుకున్నావు బావా?"

"అయినా నేను మోహనను మరచిపోలేను, నన్ను విసిగించకు"

"మరి నా జీవితం ఇంతేనా?"

"అది నీ ఖర్మ, నేనేం చేయలేను" దుప్పటి తలనిండుగా కప్పుకున్నాను. కావేరి వెక్కిళ్ళు నాకు వినిపిస్తూనే వున్నాయి. కానీ నాకు జాలి కలగడం లేదు. నా ఆలోచనల నిండా మోహనే! భర్తతో ఆత్మవంచన చేసుకుంటూ ఆమె అక్కడ ఎలా కాపురం చేస్తుందో ఏమో?! ఎక్కడున్నావు మోహనా, ఎలా ఉన్నావు? ఒక్కమారు కనిపించవూ!

రోజురోజుకు ఆమె గురించిన ఆలోచనలు ఉధృతమవుతున్నాయే కాని తగ్గటం లేదు. నిరాసక్తంగా జీవితాన్ని నెట్టుకొస్తున్నాను. విజయవాడకు వెళ్ళి మోహన గురించి ఆరా తీద్దామంటే చేతిలో డబ్బులు లేవు.

అకస్మాత్తుగా మా నాన్నగారు గుండెపోటుతో పోయారు. ఆయన డిపార్టుమెంటులోనే నాకు ఉద్యోగం ఇచ్చారు. అమ్మ బలవంతం మీద ఉద్యోగంలో జాయినయ్యాను. మా ఆఫీసులో ఒకతని వల్ల తెలిసింది. మోహన నాన్నాయనకు బదిలీ అయి హైదరాబాద్‌లోనే ఉంటున్నారని. అతనిది ఏ డిపార్టుమెంటో కూడా తెలియదు. మా బ్రాంచి ఒకటి హైదరాబాద్‌లో ఉండడంతో నేను అక్కడికి బదిలీకై ప్రయత్నాలు సాగించి సఫలీకృతుడనయ్యాను.

తరువాత వచ్చి తీసుకెళ్తానని కావేరిని పుట్టింట్లో వదిలేసి ఆనందంగా హైదరాబాద్‌కు బయలుదేరాను.

మోహన అడ్రసు తెలుసుకోవాలంటే నాకున్న ఒకే ఒక ఆధారం ఆమె సాహితీ పిపాస! ఆమెకు మంచి పుస్తకాలు దొరికితే చాలు భోజనమే అక్కర్లేదన్నట్టుగా ప్రవర్తించేది. విశాఖలో ఏ సాహిత్యగోష్ఠి జరిగినా తప్పనిసరిగా హాజరయ్యేది. తప్పదన్నట్లుగా నేనూ వెంట వెళ్ళేవాడిని. చలం, బుచ్చిబాబు, కుటుంబరావు ఇంకా ఏవేవో పేర్లు తన్మయత్వంగా చెప్పేది. అందుకే కోఠిగుండా వెళ్తున్నప్పుడు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వైపు, నవయుగ బుక్ హౌస్ వైపు అప్రయత్నంగానే నా కళ్ళు తిరిగేవి. అక్కడ నిలబడి వున్న అమ్మాయిల్లో నా మోహన ఉందేమోనని వెతుక్కునేవాడిని. ఆదివారాల్లో బడీచౌడీ, కోఠీ, ఆబిడ్స్ ఫుట్‌పాత్‌లపై పాతపుస్తకాల ప్రదర్శనల్లో పిచ్చిగా తిరిగేవాడిని. ఆంధ్ర సారస్వత పరిషత్ హాల్, శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయంలో జరిగే సాహితీ సభలకు హాజరవ్వడం అలవాటు చేసుకున్నాను. ఇలా నా అన్వేషణలో ఓ సంవత్సరకాలం ఇట్టే గడిచిపోయింది.

మా అత్తగారింటినుండి, మా అమ్మదగ్గరి నుంచి ఉత్తరాలెన్నో వస్తున్నాయి— వచ్చి కావేరిని తీసుకెళ్ళమని. కావేరిని తెచ్చుకొని ఉన్న కాస్త మనశ్శాంతిని కూడా పోగొట్టుకోవడం ఇష్టంలేక వెళ్ళలేదు. నా మనసులో ఇంకా నమ్మకం— ఒకవేళ నేను మోహనను కనుక్కోగలిగితే ఆమె తన భర్తను వదిలేసి నా దగ్గరికి వచ్చేస్తుందని!

నా ఆశలన్నీ నిరాశలుగా మారిపోతున్న



సమయాన నాకు మోహనను కలుసుకునే అవకాశాన్ని కల్పించింది 'హైదరాబాద్ బుక్ ఫెయిర్!'

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రారంభమయింది. మధ్యాహ్నం ఒకటిన్నరకు ప్రారంభమై రాత్రి ఎనిమిదన్నరకు ముగుస్తుంది. ఈ వారం రోజులకు ముందే సెలవు మంజూరు చేయించుకున్నాను. ఆమెను కలుసుకోవాలంటే ఇదే చివరి అవకాశం. ఆమె తప్పక ఈ బుక్ ఫెయిర్‌కు వస్తుందని నా నమ్మకం.

మొదటిరోజు వెళ్ళి గేటుకు కొంచెం ఎడంగా నిలబడ్డాను. ఆమె భర్త తన అభిప్రాయాలకు, అభిరుచులకు విలువ ఇచ్చేవాడయితే సాయంత్రం అతనితో కలిసే వస్తుంది. లేదూ మధ్యాహ్నం పూట తనే ఒంటరిగా వస్తుందనే ఆలోచనలో ఆ ఏడుగంటలపాటు ఒళ్ళంతా కళ్ళు చేసుకుని వచ్చేవారిని చూస్తూ నిలబడ్డాను. మొదటిరోజు కాబట్టి జనం తక్కువగా వచ్చారు. మోహన రాలేదు.

రెండవరోజు కూడా రాలేదు.

మూడవరోజూ రాలేదు.

నాలుగయిదు..... ఆరోజుకూడా గడిచిపోయింది.

ఇక ఈరోజే ఆఖరి రోజు! ఈరోజు వచ్చి తీరాలి. లేనట్లయితే నేనీ జన్మలో ఆమెను కలుసుకోలేను.

ఈ చివరిరోజున ప్రతిక్షణం నాకెంతో భారంగా గడుస్తున్నట్లుగా తోస్తుంది. నా మనసు మనసులో లేకుండాపోయింది. కాలం గడుస్తున్న కొద్దీ హృదయస్పందన ఎక్కువైంది. నా అణువణువూ ఆమెను పిలుస్తోంది.

ఎక్కడున్నావు మోహనా, నిన్ను ఒక్కసారైనా కలుసుకుని కనులారా చూసుకుని తరించాలని తహతహలాడుతున్న నీ ఈ మురళిలో నవజీవన రాగాన్ని పలికించడానికి రా! ఈ శిథిలజీవితంలో కించిత్తు తృప్తిని మిగల్చడానికైనా రా! ఇక్కడ నీ కోసం ఒక నిరీక్షణగా ఘనీభవించిన నన్ను కరిగించడానికైనా రా!!

ఏడుగంటలు కావస్తుంది.

నాకు ఏడుపు ఒక్కటే తక్కువయింది.

మరో అయిదు నిముషాలకు— లోపలికి సందడిగా వస్తున్న చాలా మందిని చూపులతో గుచ్చి చూస్తున్న నాకళ్ళు ఒక్కసారిగా తళుక్కున మెరిశాయి. అది మెరుపా, కాదు కాదు, నా నాలుగేళ్ళ నిరీక్షణా అన్వేషణా ఫలించి వెలిగిన వెలుగు! ఇన్నాళ్ళ దుఃఖం నిలువునా మండి ఆనందాన్ని ఎగజిమ్మిన వెలుగు!!


వేయిమంది స్త్రీలలో కూడా ఠీవిగా ఆమె నడకను పోల్చుకోగలను. అదుగో మోహన! అదిగదిగో మోహన!!

నిజంగానే మోహన!!!

ప్రక్కన ఉంది భర్త కాబోలు— నాకన్నా మాస్లీగా అయితే లేదు. నేను కదిలి ఆమెకు ఎదురు వెళ్ళాను. "మోహనా...." పిలిచాననుకున్నాను. నా పెదాలు కదిలి వుంటాయి కాని ధ్వని రూపేణా పిలిచేంత శక్తి లేకుండా పోయిందనిపించింది నాలో. నా పిలుపును కాకుండా నన్ను చూసి ఆగిందామె.

"ఏయ్ మురళీ, నువ్వా....?!" ఆమె చూపులోనూ, స్వరంలోనూ ఆశ్చర్యం.

ఈ క్షణం – నాలోని అణువణువూ స్పందనల




సుడిగుండాల్ని సృష్టించిన ఈ క్షణం, ఆమెతో గడిపిన కోటికోట్ల జ్ఞాపకాలన్నీ దృశ్యాలు దృశ్యాలుగా ఒకే ఫ్రేములో స్తంభించిపోయిన ఈ క్షణం-- ఈ క్షణం కోసమే కదూ ఇన్నాళ్ళ నా ఆరాటం!

''.......ఎన్నాళ్ళకు కలిశాం మనం, నాలుగయిదు ఏళ్లు అవుతుంది కదూ, మనం విడిపోయి''

ఆమె మాటల్లో నన్ను కలిసిన ఆనందమేమైనా దాగి ఉందేమోనని వెతుక్కుంటూ మౌనంగా తల ఊపాను.

''అన్నట్లు, ఏమండీ నేప్పుడూ చెబుతూ ఉంటానే నా ఫ్రెండ్ మురళి ఇతనే, వీరే మా వారు'' అంటూ భర్తతో పరిచయం చేసింది.

''అవును మీ గురించి ఎప్పుడూ చెబుతుంటుంది తను'' చేయి కలుపుతూ అన్నాడతను. నేనో పిచ్చి నవ్వునవ్వి ఊరుకున్నాను.

''నీవు లోపలికి వెళ్ళి వచ్చావా మురళీ'' అందామె.

''లేదు లేదు నేనిప్పుడే వస్తున్నాను'' మొదటిసారిగా నా స్వరం పలికింది. ముగ్గురం లోపలికి ప్రవేశించాం. ఆమె భర్త కూడా నాలానే పుస్తకాలపట్ల పెద్దగా ఉత్సాహం ఉన్నట్లుగా లేదు. భార్యకోసం వచ్చినట్లుగానే ఉన్నాడు. నేనయితే ప్రతిక్షణానికోమారు ఆమెనే చూస్తున్నాను.

మోహన ఈ మధ్యకాలంలో పెద్దగా మారినట్లు లేదు. కొంత ఒళ్ళు చేసిందంతే. కాని అదే ఉత్సాహం, వైజాగ్ బీచ్‌లో కబుర్లు చెప్పుకున్నప్పటి ఉత్సాహమే తనలో ఇంకా పరవళ్ళు తొక్కుతోంది. ప్రేమించినవాడిని చేసుకోలేక ఆత్మవంచన చేసుకుంటూ జీవితాన్ని నెట్టుకొస్తున్నట్లుగా ఎంతమాత్రం లేదు. భర్తవైపు చూసి మాట్లాడుతున్నప్పుడు అతని పైని ఆరాధనని ఆమె కళ్ళ మెరుపులో నేను స్పష్టంగా చూడగలుగుతున్నాను. ఆమెతో ఒంటరిగా మాట్లాడగలిగే అవకాశంకోసం చూస్తున్నాను.

అదృష్టం కలిసి వచ్చి, ఆమె భర్త ముందుకుసాగిపోయి మరోస్టాల్‌లో ఉండడంతో అవకాశం దొరికింది.

''ఎలా ఉన్నావు మోహనా, సుఖంగా ఉన్నావా?''

వెంటనే అడిగాను. ఆమె ఎందుకో చిన్నగా ఉలిక్కిపడ్డట్టుగా తోచింది.

''నేను బాగానే ఉన్నాను కాని నీవే ఏదో పోగొట్టుకొన్నట్లుగా ఉన్నావు''

''నేనేం పోగొట్టుకున్నానో నీకు బాగా తెలుసు, నిన్ను కలుసుకోవాలని ఇన్నేళ్ళుగా ఎంత ప్రయత్నించానో తెలుసా, నీ కొరకే ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. నీకు పుస్తకాలంటే ఇష్టమని ఇక్కడికి తప్పక వస్తావని నీ కొరకే ఈ వారం రోజులనుండి గేటు దగ్గర నిలబడి వున్నాను తెలుసా.''

ఆమె నాకేసి అదోలాచూసి ''పెళ్ళి చేసుకున్నావా?'' అడిగింది.

''చేసుకున్నానులే మేనమామ కూతుర్ని. ఇష్టంలేని పెళ్ళి చేసుకుంటేనేం చేసుకోక పోతేనేం. మరి నీ కాపురం.....''

నా మాట పూర్తికాకముందే కదిలిపోయి భర్తను కలిసింది. నాలుగయిదు పుస్తకాలు కొన్నది తను ''వచ్చే ఆదివారం నీవు నీ భార్యతో కలిసి మా ఇంటికిరా మురళీ, తీరుబడిగా మాట్లాడుకోవచ్చు'

అంటూ అడ్రసు చెప్పింది ఇంటి దగ్గర పాపని ఆయాకు అప్పజెప్పి వచ్చాం, ఇక వెళ్తాం మరి''

''ఆదివారం తప్పకుండా రండి ఎదురు చూస్తుంటా'' అని తన వంతుగా భర్తకూడా చెప్పాడు.

బుద్ధిమంతునిలా తలఊపాను నేను.

ఆదివారం రానే వచ్చింది. ట్రిమ్ముగా తయారయి అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళాను. సులభంగానే దొరికింది ఇల్లు. విశాఖ బీచ్‌లో నేను తనూ కలిసి కలల్లో కట్టుకున్న ఇల్లులానే వుందది. ఆ ఇంటిముందు లాన్‌లో ఆమె ప్రక్కన నేను కూర్చుండాల్సిన చోటున ఆమె భర్త ఉన్నాడు. అంతే తేడా!

''వచ్చావా మురళీ, మీ కొరకే చూస్తున్నాం, మీ ఆవిడేది?'' కుర్చీలోంచి లేస్తూ అడిగింది మోహన.

''తలనొప్పిగా ఉందని రాలేకపోయింది తను'' చటుక్కున అబద్ధం ఆడేశాను.

''కూర్చొండి'' అంటూ ఆమె భర్త ఆహ్వానించాడు. ఆమె లోపలికి వెళ్ళి ట్రేలో స్నాక్స్, టీ పాట్ తీసుకుని వచ్చింది. ప్రామ్‌లో పాపను కూర్చోబెట్టుకొని ఆయా కాబోలు ఆడిస్తోంది.


''మురళి మా క్లాసులో చాలా క్లెవర్ స్టూడెంటు...'' అని మోహన తన భర్తతో మా కబుర్లు చెబుతోంది. వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉంది. కానీ నాలోనే అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి. .... ఆత్మవంచన చేసుకుంటూ జీవించలేను.'' అన్న మోహనేనా ఈవిడ అని ఆశ్చర్యం కూడా కలుగుతోంది. ఆమెలో ఎక్కడా బాధపడుతున్న భావనే కనబడడం లేదు. నన్ను పూర్తిగా మర్చిపోయినట్లుంది. ఆమె కళ్ళు రహస్యంగా నాకే భాష్యాన్ని అందించడం లేదు. నన్ను ప్రేమికుడిగా కాకుండా నిజమైన మిత్రుడ్ని చూస్తున్నట్లుగా నిర్మలంగా చూస్తోంది. విశాఖలో చూసుకున్న చూపుల భావాలు ఆ కళ్ళలో ఎంతమాత్రం కనబడడం లేదు. అదే నన్ను ఎంతో బాధకు గురి చేస్తుంది, కోపం కూడా కలుగుతోంది.

ఆమె భర్త కుర్చీలోంచి లేచాడు. ఆమెతో మాట్లాడడానికి ఏకాంతం దొరుకుతుంది కదాని సంబరపడ్డాను. ''పదండి, మా ఇల్లు చూద్దురు'' అన్నాడతను. నా ఉత్సాహమంతా నీరుగారిపోయి నీరసంగా లేచాను.

చాలా నీటుగా ఉంది ఇల్లు. ఏ వస్తువు ఎక్కడ ఉండాలో అక్కడే ఉంది. ఈ ఇంటిని నేను అద్దెకు ఉంటున్న కొంపతో పోల్చాలనిపించడమే లేదు. ఈ ఐశ్వర్యమూ, వారిద్దరి అన్యోన్యతా చూస్తుంటే మా అస్తవ్యస్త కాపురమూ, నా శిథిల జీవనమూ జ్ఞాపకం వచ్చి ఆమెపై ఈర్ష్య కలుగుతోంది. నేనేమో ఆమె జ్ఞాపకాలతో పిచ్చివాడినైపోయి నా జీవితాన్ని నాశనం చేసుకుంటే తనేమో నన్ను మరచిపోయి స్వర్గసుఖాల్ని అనుభవిస్తోంది. ఇది చాలా అన్యాయం. ఆమెను ఒంటరిగా కలుసుకొని మనసులోని అక్కసు తీర్చుకోనిదే ఈ బాధ తగ్గేట్టులేదు.

''మీరెక్కడ ఉంటున్నారు మురళీ'' ఇంట్లోకి

ఓ విద్యార్థి ఓ అమ్మాయి మీదకు కాగితం ఉండ విసిరాడు. అది లెక్చరర్ చూశాడు.
లెక్చరర్: ''మిస్టర్ నువ్వు చేసిన వెధవ పని చూశా'' అన్నాడు కోపంగా చూస్తూ
విద్యార్థి: ''క్షమించండి సార్! మరింకెప్పుడూ అటు వంటి పొరపాటు మీరు చూస్తుండగా చెయ్యను.
వేదుల సుబ్రహ్మణ్యం




వస్తూ ఎదురయి అడిగిందామె. తనెలాగూ రాదు కదాని మా ఇంటి అడ్రసు చెప్పాను.

"ఈ మారు మీ ఆవిడను తప్పక తీసుకుని రావాలి సుమా, లేకపోతే నేమారుకోను, సరేనా"

'సంగనాచి, ఎంత నటన నేర్చింది' మనసులోనే గొణుక్కుని "ఇక వస్తానండి" అన్నాను ఆమె భర్తకు నమస్కరిస్తూ

"మంచిది, అప్పుడప్పుడు వస్తూండండి మా మోహనకు కాలక్షేపంగా ఉంటుంది"

'అంటే నేను ఆవిడ కాలక్షేపానికి టైంపాస్ పల్లీగాడిని అయిపోయానన్నమాట' అనుకుంటూ ఆమెవంక చూడకుండానే బయటకు నడిచాను.

మోహనను కలువకముందు కంటే కలిసిన తర్వాత నా బాధ రెట్టింపయింది. ఆమెను ఒంటరిగా పట్టుకొని సంజాయిషీ అడిగితేనే కాని నా హృదయభారం తగ్గేట్లు లేదు. మధ్యాహ్న సమయంలో అయితే ఆమె భర్త ఇంట్లో వుండడని వారంరోజుల తర్వాత ఓ రోజున పర్మిషన్ తీసుకుని రెండుగంటలకే ఆమె ఇంటి తలుపు తట్టాను. నేనూహించినట్లుగా ఆమె ఏకాంతంగానే వుంది.

"నువ్వా మురళీ, నీవీటైంలో ఎప్పుడో ఒకప్పుడు వస్తావని ఎదురు చూస్తున్నాను" చిన్నగా నవ్వుతూ నన్ను ఆహ్వానించింది.

"నన్ను మోసంచేసి హాయిగా సుఖపడుతుండడమే కాక ఇంకా నా కొరకు ఎదురు చూడడమెందుకో" వ్యంగ్యంగా అన్నాను.

"ఎవరు ఎవర్నీ మోసం చేయలేదు. ఇద్దరం విధిచేతిలో ఓడిపోయాం కాని నీవే ఏవేవో ఊహించుకుంటూ నీ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నావు"

"అవును మోహనా, నిన్ను మర్చిపోలేక, నేను మారలేక నా జీవితాన్ని నాశనం చేసుకున్నాను. నీవేమో నన్ను మర్చిపోయి హాయిగా ఉన్నావు. నిజం మోహనా నేను మారలేదు. నేనింకా ఆనాటి అదే మురళినే కాని నీవు, నీవు మాత్రం ఆ మోహనవు కావు. నీవు మారిపోయావు" ఆవేశంగా అన్నాను.

"అవును మురళీ నేను మారిపోయాను, ఒప్పుకుంటాను కానీ నీవు మారలేదు! అదే నా బాధ. అందుకే ఈ రోజు నీ అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళి తాళంవేసి ఉన్న ఇల్లును చూసి నీగురించి చుట్టుప్రక్కల వాకబు చేసి వస్తున్నాను"

"నా రూంకు వెళ్ళావా, ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఎందుకంటే నీ కోసం, నీ కుటుంబ జీవితం ఎలా ఉందో తెలుసుకోవడం కోసం! నాకొరకే ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నావని, నాకొరకే హైదరాబాద్ బుక్‌ఫేయిర్ గేటువద్ద వారం రోజుల్నుండి ఎదురుచూస్తూ నిలబడ్డావని ఎప్పుడయితే చెప్పారో అప్పుడే నీ పరిస్థితి ఊహించాను. నేను ఊహించిన దానికన్నా అధ్వాన్నంగా ఉంది నీ పరిస్థితి. భార్యను పుట్టింట్లో వదిలేసి ఇక్కడ నీ ప్రియురాలి కొరకు వెంపర్లాడడం చూస్తుంటే నీవంటే నాకెంతో అసహ్యం కలుగుతోంది మురళీ, నీవు నిస్సందేహంగా తప్పుదారిలో వెళ్తున్నావు."

ఆమె ఎదురుదాడికి ఒక్క నిమిషంపాటు నేను నిరుత్తరుడనయ్యాను. నేనెంత మాత్రం ఊహించనిదిది. వెంటనే కోపం ముంచుకొచ్చింది నాకు.

"గట్టుపై కూర్చొని ఎన్నైనా నీతులు చెప్పవచ్చు మోహనా, మీ ఆడవాళ్ళు ఎంతకైనా తగినవాళ్లు! 'నిన్ను విడిచి ఉండలేను, మరొకరిని చేసుకోవలసిన పరిస్థితి వస్తే ఆత్మవంచన చేసుకుంటూ జీవించలేను' అన్న నీవేనా ఇలా మాట్లాడుతుంది. నీకొరకు నేనెంతగా తపించిపోయిందీ నీకేం తెలుసు?! కన్ను మూస్తే నీ నవ్వు, కన్ను తెరిస్తే నీ రూపం కనబడుతుంటే నేనెలా సుఖంగా కాపురం చేయగలను చెప్పు" నా కంఠం గద్గదమైంది.


"అదే నేనడుగుతున్నది, అంతగా నన్ను మరచిపోలేని నీవు మరి ఆ అమ్మాయిని పెళ్ళెందుకు చేసుకున్నావు చెప్పు. నన్ను మర్చిపోలేక పెళ్ళిచేసుకోకుండా అలాగే బ్రహ్మచారిగా ఉన్నా నీవో గొప్ప ప్రేమికుడవని గర్వపడి నీముందు ఈ రోజున సిగ్గుతో తలదించుకునే దాన్ని. అలా కాకుండా భగ్నహృదయంతో ఆత్మహత్య చేసుకుని చనిపోయినా నీ అమరప్రేమను తలచుకుంటూ అనుక్షణం దుఃఖించే దాన్ని. కానీ ఇప్పుడు నిన్ను నేనెంతో అసహ్యించుకుంటున్నాను మురళీ! ఎందుకంటే నీ జీవితాన్ని నాశనం చేసుకోవడమే గాకుండా నీ భార్య జీవితాన్ని కూడా భ్రష్టు పట్టించావు. అందుకు నిన్ను క్షమించలేను" ఆమె స్వరంలో ధ్వనించిన ఆమె ఫీలింగుయొక్క తీవ్రత నన్ను మళ్ళీ నిరుత్తరుణ్ణి చేసింది.

కొంతసేపటికి తేరుకుని "నాకెంతమాత్రం ఇష్టం లేకున్నా బలవంతంగా నాకిపెళ్ళి చేశారు మోహనా. ఏం చేయగలను చెప్పు" ఎంతో బలహీనంగా పలికింది నా స్వరం.

"మరి నేను— నేను కేరింతలు కొడుతూ పెళ్ళి చేసుకున్నాననుకున్నావా, నేనెంత ఏడ్చిందీ నీకేం తెలుసు. నా కన్నీటితో పరుపుపైని దిండెంతగా తడిసిపోయిందో ఇపుడు చెప్పినా నీకర్థం కాదు. నిద్రమాత్రలు కూడా మింగి ఆత్మహత్యాప్రయత్నం చేశాను...."

"మోహనా!"

"అవును మురళీ, శోభనం రాత్రి కూడా నా భర్త చేయిపడకుండా నేలపై నాలోనే నేను దాక్కొని పడుకున్నాను. కాని మురళీ, నా భర్త మంచితనం ముందు, అతని ప్రేమించే మనసు ముందు నేనోడిపోయాను. వారు తన ప్రేమతో నన్ను గెల్చుకున్నారు. నిజంగానే నేను మారిపోయాను. నీవూ మారాలి మురళీ"



పొద్దున్నే కారుమీద స్పీడుగా పోతున్న విశ్వాన్ని రామారావు ఎదురుగా వెళ్ళి ఆపి "ఎందుకంత స్పీడు ఎక్కడికి పోతున్నావు" అని అడిగాడు.

"ఆ ఏంలేదు మార్నింగ్ వాక్ "అంటూ విశ్వం కారుడ్రైవ్ చేసుకుంటూ వెళ్ళి పోయాడు.

జీడిగుంట నరసింహామూర్తి, కర్నూలు

"అదే నాకు చేతకావడం లేదు. ఎంత ప్రయత్నించినా నిన్ను మర్చిపోలేక పోతున్నాను." తల అడ్డంగా ఊపుతూ విసురుగా అన్నాను.

"సరే నీవు నన్ను మర్చిపోలేవు. మర్చిపోకుండా ఏం చేస్తావు? అక్కడ నీ భార్య జీవితం బండబారిపోతుంటే నీవిక్కడ నా ఇంటి చుట్టూ పిచ్చివాడిలా తిరుగుతావా? లేక నన్ను నా భర్తను, పాపను వదిలేసి నీతో లేచి రమ్మంటావా? చెప్పు మురళీ, కాని నా భర్త నన్నెంతో ప్రేమగా చూసుకుంటున్నారు. అటువంటి ప్రేమమూర్తిని వదిలివచ్చి నీతో సుఖపడగలనంటావా? మరిద్దరం బాగున్నా నీ భార్యా, నా భర్తా ఏమైపోతారు. వాళ్ళగురించి కూడా ఆలోచించి పరిష్కారం చెప్పు మురళీ"

"ఆపు మోహనా, నా తల బద్దలైపోతుంది....'

"జీవితం వాస్తవచిత్రం చాలా సంక్లిష్టంగా ఉంటుంది మురళీ, నీలాంటి వాళ్ళకది భయంకరంగానూ తోస్తుంది. నీ భార్యను తీసుకురాకుండా నీవిలా జీవితాన్ని నాశనం చేసుకుంటున్న సమస్యకు వాస్తవంలో పరిష్కారాన్ని చూపించు. అది మన నలుగురి జీవితాల్ని చక్కదిద్దేలా ఉండాలి"

నిజంగానే నా బుర్ర వేడెక్కిపోయింది. నా ఈ సమస్యను ఈ కోణంలోంచి ఇంత నిశితంగా నేనెప్పుడూ ఆలోచించలేదు. ఇప్పుడు ఆలోచిస్తున్నా నాకేం తోచడం లేదు. అందుకని జవాబు చెప్పలేకపోయాను.

"నాకు తెలుసు మురళీ నీ దగ్గర జవాబు లేదు. నీలాంటి చాలామంది కుర్రాళ్ళ పరిస్థితి ఇదే. మీకు కావాల్సిందేదో మీకు తెలీదు. ఇప్పుడు బాగా ఆలోచించి చెప్పు నీకేం కావాలి? నీ సమస్య ఏంటి? నీ భార్యను తీసుకురావడానికి ఉన్న అవరోధాలేంటి? చెప్పు మురళీ తొందరలేదు, బాగా ఆలోచించుకొని చెప్పు. నీవు ప్రేమించిన అమ్మాయి నీకు దక్కలేదు. సరే ఒప్పుకుంటాను. కానీ ఆ అమ్మాయి సుఖంగా కాపురం చేసుకుంటుంది. ఇప్పుడు నీ దగ్గరికి వచ్చే అవకాశమే లేదు. ఆమె సుఖంగా ఉండడం నీకిష్టంలేదా?"

"ఉంది...."

"మరి నీ ప్రాబ్లమేంటి?"

"ఏం లేదు" ఒక్క ఉదుటున లేచి నిలబడ్డాను. "నిజం మోహనా, నాకే ప్రాబ్లమూ లేదు"

"లేచావేంటి, కూర్చో"

"లేదు మోహనా నేను వెళ్ళాలి"


"ఎక్కడికి"

"అనకాపల్లికి మా అత్తగారింటికి"

"నిజంగానే" అంటూ నా చేయిని పట్టుకుని సంతోషంగా ఊపుతున్న మోహన కళ్ళలోకి చూసిన నేను క్షణంపాటు చిన్నగా వణికిపోయాను. అవును, ఆమె అదే మోహన! విశాఖలో కమ్మని కబుర్లు చెప్పిన ఆ కళ్ళే— ఏం మారలేదు!!

నేను నేను కాదేమో?!

బహుశా మారిపోయి ఉంటానిన్నాళ్ళు!!




'మీ సబ్బు ఇంత త్వరగా ఎలా మార్కెట్ అయిందీ?'

అసలు రహస్యం ఏమిటంటే మా సబ్బుతో పాటు ముందుగా ఓ శాంపిల్ సబ్బు ఫ్రీగా ఇస్తాం. అది రుద్దుకోవడంతోనే దురద మొదలవుతుంది, ఆ తరువాత అసలు సబ్బు వాడితే అది తగ్గిపోతుంది. అదే అసలు శాంపిల్ సబ్బురహస్యం" రహస్యంగా చెప్పాడు సేల్స్‌మెన్.

హిమజా రమణ, చిలకలూరిపేట

